సాక్షి అనంతపురం

మంగళవారం | 3 | సెప్టెంబర్ | 2024



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టమాట కిలో రూ.25

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.25, కనిష్టం రూ.7, సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 35.2°/ 23.4°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పగలు ఎక్కువగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

వరద అంచనాలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా.. వరదలను అంచనా వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంచనా వేయడంలో విఫలం కావడంతోనే విజయవాడ అతలాకుతలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి పూడిక తీయలేదనో, మట్టి తీయలేదనో సాకు చెబుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు సీఎం స్థానంలో ఉండి ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కష్టకాలంలో ప్రతి ఒక్కరూ వరద బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న బొలెరో

- మహిళా కూలీ మృతి
- 9 మందికి గాయాలు



మృతురాలు అన్నపూర్ణమ్మ

కంబదూరు: ఎదురుగా వస్తున్న ఆటోను బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మరో 9 మందికి గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని రొప్పం, బీములకుంట, దాలువాపల్లి గ్రామాలకు చెందిన మహిళా కూలీలు సోమవారం ఉదయం కంబదూరు మండలం కుర్లపల్లిలోని రైతు కమ్మ తిమ్మయ్య పొలంలో టమాట కాయలను తొలగించేందుకు ఆటోలో బయలుదేరారు. మేలకుంట దాటిన తర్వాత నాలుగు రోడ్ల కూడలి వద్దకు చేరుకోగానే కుర్లపల్లి నుంచి అనంతపురం వైపు వెళుతున్న బొలెరో వాహనం వేగంగా ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న అన్నపూర్ణమ్మ(45) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ రాము, మహిళా కూలీలు రత్నమ్మ, రాధమ్మ, మాలమ్మ, యల్లక్క, లక్ష్మీదేవమ్మ, నాగలక్ష్మి, గీతమ్మ, రాధమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. రాము పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.







రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో పాలు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, రాప్తాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, శింగనమలలో అన్నదానం చేస్తున్న పార్టీ నేత ఆలూరి సాంబశివారెడ్డి

జోహార్ రాజన్నా..

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- మహానేతకు ఘన నివాళులర్పించిన ప్రజలు, అభిమానులు, పార్టీ నేతలు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు

అనంతపురం కార్పొరేషన్: రైతు బాంధవుడు, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి జిల్లా ప్రజలు ఘన నివాళులర్పించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మహానేత విగ్రహాలను ఆరాధించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

- అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు. అనంత మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆద్యుడు వైఎస్సార్ అని కొనియాడారు. రాయలసీమకు కృష్ణా జలాలు ఆయన చలువే అన్నారు. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా..ప్రజల హృదయాల్లో పదిలంగా ఉన్నారన్నారు.
- రాప్తాడులో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మహానేత తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలు ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపాయని ఆయన కొనియాడారు.
- శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం, శింగనమలలో పార్టీ జిల్లా నేత ఆలూరి సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. శింగనమలలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు.
- ఉరవకొండ నియోజకవర్గం కూడేరులో వైఎస్సార్ విగ్రహానికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్, జలయజ్ఞం తదితర పథకాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగాన్ని ఆదుకున్న ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని కొనియాడారు.
- రాయదుర్గంలోని వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు.
- కళ్యాణదుర్గంలో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నేత ఉమామహేశ్వర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.
- గుంతకల్లులో మునిసిపల్ చైర్‌పర్సన్ భవాని ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుత్తి, పామిడిలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు.
- తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సేవలను కొనియాడారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు



కూడేరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు

అక్రమ లేఔట్‌పై అధికారుల కొరడా

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలో 213–3 సర్వే నంబరులో 6 ఎకరాల్లో అక్రమంగా వెలసిన లేఔట్‌పై అధికారులు కొరడా ఝులిపించారు. కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే భూముల ఆక్రమణలు, అక్రమ లేఔట్లు వేసి సాగిస్తున్న దందాపై 'సాక్షి'లో గత నెల 29న ''భూచోళ్లున్నారు జాగ్రత్త'' శీర్షికతో వెలువడిన కథనానికి కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఈ క్రమంలో కొడిమి సమీపంలో వెలసిన అక్రమ లేఔట్‌పై పంచాయతీ అధికారులు కొరడా ఝులిపించారు. పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ రెండురోజుల కిందట లేఔట్‌ను పరిశీలించారు.కాంపౌండ్‌కు బ్యానరు ఏర్పాటు చేయించారు.

అమ్మినా, కొనినా సంబంధం లేదు

లేఔట్ నిర్వాహకులకు నోటీసు జారీ చేశారు. '213–3 సర్వే నంబరులోని 6 ఎకరాల భూమిలో అభివృద్ధి చేస్తున్న అనధికార లేఔట్‌కు అహుడా నుంచిగాని, కొడిమి పంచాయతీ నుంచి గాని ఎలాంటి అనుమతులూ లేవన్నారు. ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసినా అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అలాగే పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించినా, చించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



లేఔట్ ప్రహరీకి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కలెక్టర్‌తోనే తప్పు చేయించారు !

- జిల్లా అధికారి నమ్మకాన్ని తెలివిగా సొమ్ము చేసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి
- సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి రీప్యాట్రేషన్ టీచర్లకు పోస్టింగ్‌లు
- ముగ్గురికేమో పాత స్థానాలు
- ఇద్దరికి కోరుకున్న చోటుకు
- మరొకరికి అదే మండలంలో
- అక్రమాలపై 'అంతా కలెక్టర్ నిర్ణయం' అంటూ తప్పించుకున్న డీఈఓ

అనంతపురం ఎడ్యుకేషన్: రీప్యాట్రేషన్ అయిన సమగ్ర శిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులకు పోస్టింగ్ ఇచ్చే విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి అంతా తను అనుకున్నట్లే చేసేశారు. తన చేతికి మట్టి అంటకుండా చాలా తెలివిగా ఆ తప్పులన్నీ కలెక్టర్‌తోనే చేయించారు. ఫారెన్ సర్వీస్‌పై సమగ్ర శిక్షకు వచ్చిన టీచర్లతో రేయింబవళ్లు ప్రాజెక్ట్ పని చేయించుకున్నారు. వారు స్టేషన్ సీనియార్టీ కోల్పోయారు. అలాంటి వారికి తిరిగి స్థానాలు ఇచ్చే విషయంలో డీఈఓ కక్ష సాధింపుతో వ్యవహరించారు. ముగ్గురికేమో పాత స్థానాలు కేటాయించారు. మరో ఇద్దరికి కోరుకున్న చోటు ఇచ్చారు. మరొకరికి అదే మండలమే కేటాయించారు. ఇంకొకరికి పాతస్థానం ఖాళీ ఉన్నా... అక్కడికి కాకుండా స్పష్టత కోసం కమిషనర్‌కు లేఖ రాశారు. వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న డీఈఓ వైఖరిపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.



నిబంధనలు ఏమి చెబుతున్నాయంటే...

నిబంధనల ప్రకారం ఫారెన్ సర్వీస్‌కు వచ్చే ముందు ఏ స్కూల్ నుంచి వచ్చారో అక్కడ ఖాళీ ఉంటే అదే స్థానానికి పంపాలి. ఖాళీ లేకపోతే పక్క స్కూలు లేదా ఆ మండలంలో ఖాళీ లేకపోతే పక్క మండలంలో కేటాయించాలి. ఈ క్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, గోవిందరెడ్డి స్థానాలు ఖాళీగా ఉండడంతో వారిని పాత స్థానాలకే పంపారు. కొత్తచెరువు బాలికల పాఠశాల నుంచి వచ్చిన జీసీడీఓ మహేశ్వరికి ప్రస్తుతం అక్కడ ఖాళీగానే ఉన్నా ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. స్పష్టత కోసమంటూ కమిషనర్‌కు లేఖ రాశారు.

ఇదేమి నిబంధనో కలెక్టర్‌కే తెలియాలి

డి.హీరేహాల్ మండలంలో పని చేస్తున్న మాధవరెడ్డిని రాప్తాడు మండలం హంపాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు, విడపనకల్లు మండలంలో పని చేస్తున్న గోపాలకృష్ణను శింగనమల జెడ్పీహెచ్‌ఎస్‌కు ఇచ్చారు. ఏ నిబంధనను అనుసరించి వీరికి ఆయా స్థానాలు ఇచ్చారో కలెక్టర్‌కే తెలియాలి. ఉరవకొండ మండలం వ్యాసాపురం స్కూల్ నుంచి వచ్చిన చంద్రమోహన్‌రెడ్డికి ప్రస్తుతం ఆ స్కూల్‌లో ఖాళీ లేకపోవడంతో నిబంధన మేరకు అంటూ అదే మండలంలో మోపిడి స్కూల్ కేటాయించారు. ఇది కూడా రెండు రోజుల క్రితమే ఖాళీ అయింది. అలాగే గోపాలకృష్ణ, మాధవరెడ్డి విషయంలో ఎందుకు నిర్ణయం తీసుకోలేదో డీఈఓ స్పష్టత ఇవ్వలేకపోయారు. ఇదే విషయంపై డీఈఓను బాధితులు ప్రశ్నిస్తే.. 'అంతా కలెక్టర్ నిర్ణయం నాయనా' అంటూ చేతులెత్తేయడం గమనార్హం.

తప్పుడు నివేదికతో...

వాస్తవానికి చంద్రమోహన్‌రెడ్డికి ప్రత్యేక అవసరాల కుమార్తె ఉంది. తల్లిదండ్రులు దగ్గరుండి ఆమెకు సపర్యలు చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని ఆ దంపతులు స్వయంగా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. తనకు ఉదిరిపికొండ స్కూల్ ఇవ్వాలని వేడుకున్నారు. ఈ అంశాన్ని పరిశీలించాలని అప్పట్లో డీఈఓకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. జిల్లా అధికారి తమపై ఉంచిన నమ్మకాన్ని డీఈఓ, ఓ సూపరింటెండెంట్, ఓ సీనియర్ అసిస్టెంట్ ముగ్గురూ కలిసి తెలివిగా సొమ్ము చేసుకున్నారు. తప్పుడు నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌నే తప్పుదోవ పట్టించారు. మొత్తం వ్యవహారంలో చంద్రమోహన్‌రెడ్డికి అన్యాయం జరిగేలా చేశారనే విమర్శలు కార్యాలయ సిబ్బంది నుంచే వినిపిస్తున్నాయి. తనకు సంతృప్తికరమైన పోస్టింగ్ ఇచ్చారనే కారణంతో ఓ టీచర్... సీసీ ద్వారా పెద్ద మేడమ్‌కు నచ్చిన విలువైన వస్తువులు కొనుగోలు చేసిచ్చారనే ఆరోపణలూ ఉన్నాయి. మరొక టీచరు డీఈఓ సామాజిక వర్గానికి చెందిన మంత్రితోనూ, ఓ ఎమ్మెల్యేతోను ఫోన్లు చేయించినట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలాఉండగా కరుడు కట్టిన టీడీపీ కార్యకర్తల్లా ఉండే టీచర్లు సైతం డీఈఓ నిర్ణయాన్ని తప్పుబడుతుండడం గమనార్హం.

24 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: వాయుగుండం ప్రభావంతో జిల్లాలో తేలికపాటి వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 24 మండలాల పరిధిలో 2.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పామిడి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, గుత్తి, గుంతకల్లు, కంబదూరు, పెద్దపప్పూరు, కణేకల్లు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదు కాగా.. మిగతా మండలాల్లో తుంపర్లు పడ్డాయి. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా.. ప్రస్తుతానికి 7.9 మి.మీ నమోదైంది. మొత్తమ్మీద ఈ ఖరీఫ్‌లో జూన్ 1 నుంచి 213.7 మి.మీ సాధారణ వర్షపాతానికి గానూ 82.9 శాతం అధికంగా 390.8 మి.మీ నమోదైంది. 28 వర్షపు రోజులు (రెయినీడేస్) రికార్డయ్యాయి. రాగల రెండు రోజులూ జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం అర్బన్: సమస్యలపై ప్రజల నుంచి అందే అర్జీలను ఏస్థాయిలోనూ నిర్లక్ష్యం చేయకూడదని జిల్లా అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్రజల సమస్యలకు సంతృప్తికర పరిష్కారం చూపించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు శిరీష, కరుణకుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య గురించి వివరంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువు కంటే ముందే అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు.

ప్రాజెక్టులకు భూసేకరణపై దృష్టిపెట్టండి

జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. భూసేకరణ అంశంపై సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ రహదారులు, పవర్ గ్రిడ్, సోలార్ పవర్, రైల్వే, ఏపీఐఐసీ, తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, భూ కేటాయింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అవసరమైన చోట గ్రామ సభలు నిర్వహించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లకు సూచించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా కోర్టు కేసులు ఉంటే త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు రాణిసుస్మిత, శ్రీనివాసులురెడ్డి,ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్ కుమార్, హెచ్‌ఎల్‌సీ ఎస్‌ఈ రాజశేఖర్, ఎస్‌డీసీ కరుణకుమారి, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, ఎన్‌హెచ్ డీఈ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యం సాధించాలి

ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి పథకం అమలుపై సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. అనంతరం కేంద్రీయ విశ్వవిద్యాలయం, పర్యాటక శాఖ, ప్రజారోగ్య శాఖల అధికారులతో సమీక్షించి తగిన ఆదేశాలిచ్చారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతకు చేరుకున్న క్రికెటర్లు

అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం)లో ఈ నెల ఐదు నుంచి జరిగే దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచుల కోసం పలువురు క్రికెటర్లు సోమవారం రాత్రి అనంతపురం నగరానికి చేరుకున్నారు. స్థానిక సప్తగిరి సర్కిల్లోని ఓ త్రీస్టార్ హోటల్లో బస చేస్తున్నారు. వీరిలో అర్షదీప్ సింగ్, శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్, అక్షర్ పటేల్ వంటి అంతర్జాతీయ క్రికెటర్లు కూడా ఉన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అక్షర్ పటేల్



రుతురాజ్ గైక్వాడ్



శ్రేయస్ అయ్యర్



అర్షదీప్ సింగ్



క్రికెటర్లు బస చేస్తున్న హోటల్ వద్ద అభిమానుల సందడి

క్లుప్తంగా

ఘనంగా ఎల్ఐసీ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎల్ఐసీ మేనేజర్లు, ఏజెంట్లు, కార్యాలయ సిబ్బంది

అనంతపురం అగ్రికల్చర్: ఎల్ఐసీ బ్రాంచి-2 కార్యాలయంలో సోమవారం ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ భరత్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ మమత మాట్లాడుతూ... అన్ని వర్గాల సహకారంతో ఎల్ఐసీ బలోపేతం అయిందన్నారు. ఎల్ఐసీ మరింత బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని కోరారు.

12న బైబిల్ మిషన్ చర్చి వార్షికోత్సవం



పోస్టర్లను విడుదల చేస్తున్న పాస్టర్స్ సంఘం నాయకులు

రాప్తాడురూరల్: 'బైబిల్ మిషన్ చర్చి 7వ వార్షికోత్సవం' ఈనెల 12న అనంతపురం నగరంలోని లలిత కళా పరిషత్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను సోమవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి జిల్లా పాస్టర్స్ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ బందెల రాజు, ఉపాధ్యక్షుడు పాస్టర్ పి. మార్క్, సెక్రటరీ పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లికి చెందిన గడుపూటి రంగప్పపై హత్యాయత్నం చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ హేమంత్‌కుమార్ వెల్లడించారు. గత నెల 29న భూమి తగాదా విషయంలో రంగప్పతో ఆయన అన్న చిన్నసుబ్బయ్య, వదిన సువర్ణమ్మ గొడవ పడి రాయి, బడిసెతో దాడి చేశారు. ఘటనకు సంబంధించి క్షతగాత్రుడి భార్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం పక్కా ఆధారాలతో సుబ్బయ్య, సువర్ణమ్మ దంపతులను సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి చదరంగం పోటీలు

గుంతకల్లు: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి అండర్-19 చదరంగ పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంతకల్లు, గుత్తి, అనంతపురం ప్రాంతాలకు చెందిన దాదాపు 83 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతపురానికి చెందిన గండికోట అనన్య, సాకేత్, ఆదిత్యరెడ్డి, స్టీఫీన్ తొలి నాలుగు స్థానాలను దక్కించుకున్నారు. 5, 6, 7వ స్థానాల్లో వేదదీప్, యువరాజ్ కార్వా, కాసన్నగారి బాలాజీ నిలిచారు. వీరికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, చెస్ క్రీడాకారుడు అనిల్‌కుమార్, సీపీఐ నాయకులు ఎస్ఎండీ గౌస్, గోపీనాథ్, రామాంజనేయులు, మజీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి నిరవధిక సమ్మె



తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యసాయి కార్మికులు

ఆత్మకూరు: తాము ఈ నెల 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు సత్యసాయి నీటిసరఫరా కార్మికులు తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీసులకు సమాచారం తెలుపుతూ లేఖలు అందించారు. సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, సత్యసాయి సిబ్బంది శ్రీరాములు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఓలాకు రూ.లక్ష జరిమానా

అనంతపురం సెంట్రల్: ఓలా ద్విచక్ర వాహనం రంగు మారుస్తామని తీసుకెళ్లి తిరిగి ఇవ్వని సదరు కంపెనీకి రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా వినియోగదారుల న్యాయస్థానం చైర్‌పర్సన్ ఎం.శ్రీలత సోమవారం తీర్పు వెల్లడించారు. నగరానికి చెందిన స్వాతి 2022లో లిక్విడి సిల్వర్ రంగు ఓలా ఎలక్ట్రిక్ వాహనాన్ని కొనుగోలు చేయడానికి ఓలా యాప్ ద్వారా నమోదు చేసుకున్నారు. రూ. 1.39 లక్షలు చెల్లించారు. అయితే ఎంచుకున్న రంగు బదులు మరో రంగును సరఫరా చేయడంతో మార్చుచేయాలని సదరు కంపెనీ ప్రతినిధులను కోరారు. రెండు నెలలకు వాహనాన్ని కంపెనీ ప్రతినిధులు తీసుకెళ్లినా స్టాక్ లేదని చెప్పి కొత్త వాహనం ఇవ్వలేదు. పైగా చెల్లించిన సొమ్ము కూడా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితురాలు వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే కంపెనీ ప్రతినిధులు న్యాయస్థానానికి హాజరుకాకపోవడంతో ఈమేరకు న్యాయస్థానం చైర్‌పర్సన్ ఎం. శ్రీలత, సభ్యులు డి గ్రేస్ మేరి, బి. గోపీనాథ్ లతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది.

సంక్షేమ ప్రదాత వైఎస్సార్

- ఆయన చలువతోనే సీమకు కృష్ణా జలాలు
- మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి
- భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు



జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనంతపురం కార్పొరేషన్: 'వెనుకబడ్డ రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలు తెచ్చిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుంది. దీనికితోడు జలయజ్ఞంతో అనే ప్రాజెక్ట్‌లకు వైఎస్సార్ రూపకల్పన చేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు.' అని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, జెడ్పీ ఆవరణంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ గతంలో ఎన్టీఆర్, చంద్రబాబులు హంద్రీనీవాను కేవలం శంకుస్థాపనలకు మాత్రమే పరిమితం చేస్తే వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక పనులు వేగవంతం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు వైఎస్సార్ అని అన్నారు. సంక్షేమ పథకాలకు కేరాఫ్ అంటే వైఎస్సార్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని 2004లో సీఎం అయ్యాక దేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ , ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాలు ఎంతో మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయన్నారు.

ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం

జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి మహానేత వైఎస్సార్ చర్యలు తీసుకున్నారన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని ప్రజలకు అందించారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ మైనార్టీలు సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారంటే అది మహానేత వైఎస్సార్ చలవేనన్నారు. 4 శాతం రిజర్వేషన్ ద్వారా ముస్లిం మైనార్టీలు ఉన్నత పదవులు సాధించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ పంచాయితీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రంగస్వామియాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, ఎగ్గుల శ్రీనివాసులు, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, చింతా సోమశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, నాయకులు మారుతీనాయుడు, దిపీల్‌రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, వెన్నం శివరామిరెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, భారతి, రాధ, భారతి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

మరపురాని మహానేత వైఎస్సార్

రాప్తాడు: జనరంజక పాలనతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరుపురాని నేతగా నిలిచిపోయారని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని సోమవారం రాప్తాడులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోనూ వైఎస్సార్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిత్రా వెంకటేష్, నాయకులు పసుపుల నరసింహగౌడ్, చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ముత్యాలు, బుడగ నాగరాజు, సింగారప్ప, మధుసూదన్ రెడ్డి, మన్నల రవి, నాగరాజు, రామకృష్ణ, సాకే చంద్ర, చిరుతల నాగేంద్ర, చిన్న కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, బండి శ్రీనివాసులు, డొక్కా రామచంద్ర, నారాయణరెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రజలకిచ్చిన ప్రతి హామీని అమలు చేసి జనరంజక పాలన చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ తన హయాంలో చేసిన సేవలు, అమలు చేసిన పథకాల గురించి వివరించారు. అదే విధంగా మండలంలోని తలుపూరు, వడ్డుపల్లి, సింగిపల్లి, గొరిదిండ్ల తండా, పాపంపల్లి, ముట్టాల, పి.యాలేరు, బి.యాలేరు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, బాలపోతన్న, చెన్నారెడ్డి, జయరామిరెడ్డి, వన్నూరప్ప, నాగరాజు, విశ్వనాథ్‌రెడ్డి, ఫణిరెడ్డి, గోపాల్, అంజినప్ప, అతికొరెడ్డి, కృష్ణానాయక్, ప్రసాద్, దామోదర్‌రెడ్డి, శ్రీరామ్, మురళి, ఓబీ టైలర్ వెంకటేష్, ఎర్రిస్వామి, ఆంజనేయులు, పెద్ద కొండారెడ్డి, వెంకటేష్, పరిగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఏ ఆధ్వర్యంలో...

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) ఆధ్వర్యంలో సోమవారం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి ని జరుపుకున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకటరమణ, రవీంద్రారెడ్డి, గోపాల్, గోవిందరెడ్డి , రాధాకృష్ణారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, మహేంద్ర, జిల్లా నాయకులు రామకృష్ణ, వెంకటరెడ్డి, శివవెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సిద్ధప్రసాద్ పాల్గొన్నారు.



ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి నయనతారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



జెడ్పీ వద్ద నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతిలో పాల్గొన్న వైఎస్సార్‌టీఏ నాయకులు

పేదల పక్షపాతి వైఎస్సార్

- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం సెంట్రల్: పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కొనియాడారు. సోమవారం ఎస్కేయూనివర్సిటీ ముఖద్వారం వద్ద వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ రాష్ట్రానికి అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, నాయకులు నసనకోట ముత్యాలు, రెడ్డివారి యోగానందరెడ్డి, వాసు, హేమంత్‌కుమార్, రమేష్, ఆది, వీరు యాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయాలు కొనసాగిద్దాం

- మాజీ మంత్రి సాకే శైలజానాథ్



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తపనపడే వ్యక్తి వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఆయన ఆశయాలు కొనసాగిద్దామని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. సోమవారం మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాకే శైలజానాథ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన, రైతు సంక్షేమం కోసం జీవితం మొత్తం త్యాగం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన లేక పోవడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి తీరని లోటన్నారు. ఆయన బతికి ఉంటే రాష్ట్ర విభజన జరిగేది కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్ల పల్లి ప్రతాప్ రెడ్డి, గాజుల వాసు, జాన్‌వెస్లీ, శివ, పరమేశ్వర రెడ్డి, శర్మస్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన ఉద్యమంలో భాగస్వాములు కావాలి

అనంతపురం సెంట్రల్: నగరంలో పోలీసు శిక్షణ కళాశాలలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు హరినాథరెడ్డి అధ్యక్షతన రక్తదానం - శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై శిక్షణా ఎస్ఐలకు సోమవారం అవగాహన కల్పించారు. మానవత సంస్థ కన్వీనర్ తరిమెల అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీసు అధికారులకు రక్తదాన ఉద్యమంలో పాల్గొనే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. రక్తదాన ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మానవత కో కన్వీనర్ సలీమ్ మాలిక్ , 24వ బ్యాచ్‌కు చెందిన 400 మంది శిక్షణ పొందుతున్న ఎస్ఐలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రవాణాశాఖలో గందరగోళం

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు (ఎఫ్‌సీ) జారీ ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో మొత్తం గందరగోళంగా తయారైంది. సోమవారం ఎఫ్‌సీల కోసం వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 10 వాహనాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం ఆర్టీఏ కార్యాలయానికి రాగా 1వ తేదీ నుంచి రాప్తాడు సమీపంలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్‌కు అప్పగించారు. అక్కడికెళ్లి చేసుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. వాహనదారులు అక్కడికెళ్లగా తమకు ఇంకా సిస్టం అప్‌డేట్ కాలేదని , ఎఫ్‌సీలు ఇచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని ఏజెన్సీ నిర్వాహకులు తేల్చి చెప్పారు. దీంతో వాహనదారులకు ఏం చేయాలో పాలుపోక అవస్థలు పడ్డారు. దీంతో బాధితులు నేరుగా ఉప రవాణా కమిషనర్ వీర్రాజు దృష్టికే సమస్య తీసుకెళ్లారు. దీనిపై డీటీసీ వివరణ కోరగా 1వ తేదీ నుంచి ఎఫ్‌సీల బాధ్యత సదరు ప్రైవేటు ఏజెన్సీదేనని స్పష్టం చేశారు. ఇబ్బందులు ఏవైనా ఉంటే వారినే సంప్రదించాలన్నారు. వాహన్ వెబ్‌సైట్‌లో స్లాట్స్ బుక్ చేసుకున్న వాహనాలను హోల్డ్ పెట్టామని, వారికి విధంగా ఎఫ్‌సీలు ఇవ్వాలో ఆలోచిస్తున్నామన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని మాల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ అధ్యక్షుడు కోట్ల గంగాధర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. కోట్ల గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని చూస్తున్నాయని దానికి వ్యతిరేకంగా మాలలు ఐక్యంగా పోరాడాలన్నారు. ఇందులో భాగంగానే నూతన జేఏసీని ఏర్పాటు చేశామన్నారు. మాల వర్గీకరణ పోరాట సమితి జేఏసీ గౌరవాధ్యక్షుడిగా ఓబులేసు, జేఏసీ అధ్యక్షుడిగా కోట్ల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా దాసరి ఆదినారాయణ, రామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా రామన్నలను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. అలాగే కోశాధికారిగా శివలింగామూర్తి, సహాయ కార్యదర్శులుగా సుగమంచి శ్రీనివాసులు, కేవీ చలపతి, ఎం రామాంజినేయులు, సుబ్బరాయుడు, నాగప్ప, నరసింహమూర్తి,లీగల్ అడ్వైజర్‌గా రంగనాయకులను ఎంపిక చేశామన్నారు. అలాగే 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసినట్లు వివరించారు.

భాద్రపదం.. పితృదేవతారాధనం

- భాద్రపద మాసంలో సందడి చేయనున్న వినాయకుడు

అనంతపురం కల్చరల్: భక్తికి, పుణ్య స్నానాలకు, విశిష్ట పూజలకు ఉత్తమమైనదిగా పరిగణించబడే భాద్రపద మాసం రానేవచ్చింది. ఇంత కాలం పండుగలు, వ్రతాలు, నోములతో సందడి చేసిన శ్రావణమాసం సోమవారం వచ్చిన పొలాల అమావాస్యతో ఘనంగా ముగిసింది. పితృదేవతారాధనే లక్ష్యంగా మోక్షమార్గం వైపు మళ్లించే పవిత్ర భాద్రపదమాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. వినాయక ప్రీతికర మాసంగా ఖ్యాతిగాంచిన ఈ మాసం ఈ నెల 3 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ ఉంటుంది. ఈ క్రమంలో వచ్చే మహాలయ పక్షాలలో పితృదేవతారాధన ఎక్కువగా జరుగుతుంది. పరమపదించిన పెద్దల శాంతి కోసం అన్నదానం , శ్రాద్ధ కర్మలను నియమనిష్ఠలతో నిర్వహిస్తుంటారు. పితృదేవతలు సంతృప్తి చెందితే మన జీవితం సుఖ సంతోషాలతో ఉంటుందని అందరి విశ్వాసం.

పండుగలు, వ్రతాలూ అధికమే

శ్రావణ మాసానికి ఎంతటి విశిష్టత ఉందో అంతే ప్రత్యేకత భాద్రపద మాసానికీ ఉంటోంది. శుభ కార్యాలు ఈ మాసంలో తక్కువే అయినా పండుగలు, వ్రతాలు అధికంగా ఉంటాయి. ఈ నెల 7న భాద్రపద బహుళ చవితి రోజున వినాయక చవితితో పాటు ప్రధాన పండుగలకు సమాంతరంగా ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించే వామన జయంతి, రుషి పంచమి, రాధాష్టమి, కేదార వ్రతాలు, అనంత పద్మనాభవ్రతం వంటి పర్వదినాలూ వరుసగా వస్తాయి. వచ్చే నెల 2న సర్వ పితృ అమావాస్యతో భాద్రపదం ముగుస్తుంది.

కలెక్టర్‌కు చెక్కు అందజేత



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న యువత

అనంతపురం అర్బన్: కేరళలోని వయనాడ్ బాధితులకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు పోగు చేసిన రూ.15,238 విరాళాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను సోమవారం అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ, ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంక రమేష్, ప్రగతి పథం యూత్ అధ్యక్షుడు కె.జయమారుతి పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 132 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం సెంట్రల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 132 వినతులు అందాయి. ఎస్పీ జగదీష్ స్వయంగా వినతుల స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన కమాండెంట్లు

నూతనంగా నియమితులైన 14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్, కర్నూలు రేంజ్ హోం గార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్ సోమవారం ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

భార్యను హింసించిన కేసులో భర్తకు జైలు

అనంతపురం సెంట్రల్: భార్యను హింసించిన కేసులో భర్తకు ఆరు నెలలు జైలు శిక్ష , రూ. 1500 జరిమానా విధిస్తూ అనంతపురం ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ న్యాయమూర్తి ప్రతిభ తీర్పు ఇచ్చారు. కేసు పూర్వపరాలు ఇలా... నగరానికి చెందిన కిరణ్మయిని బళ్లారికి చెందిన రామిశెట్టి శ్రీధర్‌కి ఇచ్చి 2017లో వివాహం జరిపించారు. కొద్దిరోజులు మానసికంగా, శారీరకంగా వేధిస్తుండడంతో 2018లో భర్త, అత్త మీద ఫిర్యాదు చేసింది. విచారించిన న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడే విషయంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ జగదీష్ అభినందించారు.

అంకితభావంతో పని చేయాలి



గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్న నాగమణిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: 'ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిద్దాం. ప్రభుత్వ సర్వజనాస్పత్రిని రాష్ట్రంలోనే ఉత్తమ ఆస్పత్రిగా తీర్చిదిద్దాం' అని గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ కల్లేటి నాగమణి పిలుపునిచ్చారు. హెడ్‌నర్సుగా ఉన్న ఆమెకు గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి వచ్చిన విషయం విదితమే. సోమవారం ఆమె మొదట సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 1 నాగమణి, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజినిలను కలిశారు. ఈ సందర్భంగా నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆమెకు గ్రేడ్ 2 క్యాప్‌ను తొడిగారు. అనంతరం శాలువా, పూల మాలతో సన్మానించారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

ఆత్మకూరు: ప్రభుత్వ బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక హాస్టల్‌ను ఎంఈఓలు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే ఈశ్వరయ్య మృతి

- విచారణలో వెలుగు చూసిన నిజాలు



మృతుడు ఈశ్వరయ్య భార్య పద్మావతితో వివరాలు తెలుసుకుంటున్న విచారణ కమిటీ సభ్యులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణం బలైనట్లు స్పష్టంగా తెలుస్తోంది. తాడిపత్రి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఈశ్వరయ్య (38) గత నెల 27న రాత్రి మరణించిన విషయం విదితమే. 'సాక్షి'లో గత నెల 28న జీజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యం ..యువకుడి బలి అన్న కథనం కూడా ప్రచురితమైంది. దీనిపై సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్లు డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ రామస్వామి సోమవారం సర్వజనాస్పత్రిలో ఈశ్వరయ్య మృతికి గల కారణాలపై విచారణ చేశారు. 'ఈశ్వరయ్య చనిపోయాకనే పెద్దసార్లు వచ్చారని, అంతవరకూ తమగోడును ఎవరూ పట్టించుకోలేదని మృతుని భార్య పద్మావతి కన్నీటి పర్యంతమైంది. ఈశ్వరయ్య మృతి తర్వాతే అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహారెడ్డి వచ్చారని స్టాఫ్‌నర్సులు నివేదికలో సమర్పించినట్లు సమాచారం. ఈశ్వరయ్య మృతిలో వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు విచారణ కమిటీ నిర్ధారణకు వచ్చింది. మంగళవారం వారు సూపరింటెండెంట్‌కు నివేదిక సమర్పించనున్నారు.

జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు

అనంతపురం కల్చరల్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు పురావస్తు శాఖ, పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. పర్యాటక అభివృద్ధిపై ఎండోమెంట్, మ్యూజియమ్, పర్యాటక శాఖ అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ సమీక్షించారు. డిస్ట్రిక్ట్ టూరిజం కౌన్సిల్ (డీటీసీ)ని ఏర్పాటు చేసి అందులో అధికారులను సభ్యులుగా చేర్చాలని తీర్మానించారు. ఇందులో భాగంగా కసాపురం, పెన్నహోబిలం, ఆలూరు కోన, బూదగవి, కంబదూరులోని ఆలయాలను కలుపుతూ రిలీజియస్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే హెరిటేజ్ సర్క్యూట్‌లో రాయదుర్గం కోట, రససిద్ధుల గుట్ట, పీస్ మెమోరియల్ హాలు, టవర్‌క్లాక్‌ను చేర్చారు. ఎకో సర్క్యూట్ పరిధిలో పీఏబీఆర్, జీడిపల్లి రిజర్వాయర్, అనంత సాగరం చెరువు, శింగనమల చెరువు, పంపనూరు పార్కు, ఆలూరు కోన వాటర్ ఫాల్స్ ఉన్నాయి. వీటన్నింటినీ కలుపుతూ గుత్తి, తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం జోన్లుగా విభజించి అందరి సహకారంతో ప్రతి పర్యాటక క్షేత్రం వద్ద ఆయా విశిష్టతను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

వివాహిత ఆత్మహత్య

అనంతపురం సెంట్రల్: నగరంలోని ఆదర్శనగర్‌లో ఓ వివాహిత వరకట్న వేధింపులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ సీఐ శ్రీకాంత్ వివరాల మేరకు... గుంతకల్లు చెందిన కుమారి (25)కి నగరంలో నవోదయకాలనీకి చెందిన సాకే మురళీతో గతేడాది ఆగష్టులో వివాహం జరిపించారు. కొద్దిరోజుల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్త, పెద్ద అత్తలు వేధించడం మొదలు పెట్టారు. లేదంటో మరొకరితో వివాహం చేస్తామని బెదిరించారు. వేధింపులు తాళలేక సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రామాంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

అనంతపురం సెంట్రల్: సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి విక్రయి విక్రయిస్తున్న గణపతిరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. నీరుగంటివీధిలో నివాసముంటూ మెకానిక్ పనిచేసే గణపతిరావు విశాఖ పరిధిలోని పాడేరు నుంచి కేజీ గంజాయి రూ.7 వేలకు కొనుగోలు చేసి జిల్లాకు తీసుకొచ్చి రహస్యంగా అమ్మేవాడు. పక్కా సమాచారం రావడంతో సోమవారం గుత్తిరోడ్డులోని మిర్చియార్డు వద్ద నిందితున్ని అరెస్ట్ చేసి 3.5 కిలోల గంజాయి, సెల్ ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

5న గురు పూజోత్సవం

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 5న స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని డీఆర్‌డీసీ సమావేశ హాలులో జిల్లా స్థాయి గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ కోసం కమిటీలను నియమించామన్నారు.

ఆక్రమణలను అరికట్టండి

అనంతపురం కల్చరల్: అన్యాక్రాంతమైన పాతూరు చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన మాన్యాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని హిందూ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్సులో అధికారులకు వినతిపత్రం అందించారు.

నీటి సమస్య రానివ్వొద్దు

ఆత్మకూరు: తమ కాలనీలో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని పోతప్పకట్ట కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేయించాలి గానీ, తమ కాలనీ కోసం వేసిన బోర్లకు ఇతర కాలనీలకు నీరిచ్చేందుకు కొత్తగా పైప్‌లైన్లు వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ కొండారెడ్డి, స్థానికులు జయరామిరెడ్డి, చెన్నారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.